ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 65 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 18 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



## రాష్ట్రాన్ని దోచుకుంటున్న
# ముగ్గురు మంత్రులు

### సీఎం నాయకత్వంలో దండుపాళ్యం బ్యాచ్
### జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా
### ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ఖమ్మం జూన్17 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో సంక్షేమం లేదని ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎపడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం

..మిగతా 2లో

## అంతర్జాతీయ ప్రమాణాలతో
# తెలంగాణ పబ్లిక్ స్కూల్

### కార్పొరేట్లను మించి... ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు
### విద్యార్థులు తలెత్తుకుని తిరిగేలా ఉత్తమ విద్య అందజేత
### ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం ఎంత మాత్రం నామోషీ కాదు
### తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి





**రంగారెడ్డి జూన్17 (ప్రభాత ఉదయం)**

ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెపకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని..

..మిగతా 2లో

# జి 7 సదస్సులో ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ

## మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్యలు

- మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు కానీ గట్టి మనిషి
- పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి అభినందనీయం
- అమెరికాతో త్వరలో భారీ ట్రేడ్ డీల్
- భారత్ అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు
- జి 7 సదస్సులో ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ
- మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్యలు




**ప్యారిస్ జూన్ 17 (ప్రభాత ఉదయం)**

హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోడీ ఇలా అన్నారు. 'ప్రపంచానికి హోర్మూజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎపడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో

..మిగతా 2లో




# రైతులు ఆర్థికంగా ఎదగాలి

### సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు
### కేబినెట్ సబ్ కమిటీలో భట్టి విక్రమార్క వెల్లడి

## సైబర్ నేరగాళ్ల శిక్షలకు కఠినమైన
# చట్టాలు తేవాలి

- అలాంటివారు జైల్లో ఉండడమే కరెక్ట్
- 63 శాతం.....
- పెరిగిన సైబర్ నేరాలు
- సుప్రీం ధర్మాసన కీలక వ్యాఖ్యలు



3



### ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో
# ఘోర రోడ్డు ప్రమాదం

- ట్రాక్టర్‌ను ఢీ కొన్న ఈ రిక్షా
- ఆరుగురు మహిళల దుర్మరణం

2

## చిన్నారి అభిమానిని
# పరామర్శించిన పవన్

### వైద్యం కోసం లక్ష రూపాయాల సాయం
### భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు




**వరంగల్ జూన్17 (ప్రభాత ఉదయం**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం వరంగల్ లో అభిమాని పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను

..మిగతా 2లో

# అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్






మొదటి పేజీ తరువాయి...

పెట్టుబడి అని చెపకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నాం



## రాష్ట్రాన్ని దోచుకుంటున్న ముగ్గురు మంత్రులు

మొదటి పేజీ తరువాయి...

యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెపకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇపడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అపలు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అపలకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అపచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశర చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజరు కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలకి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య పాల్గొన్నారు.




## జి 7 సదస్సులో ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ

మొదటి పేజీ తరువాయి...

ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోడీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారత దేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోడీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎపడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎపడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.

# రైతులు ఆర్థికంగా ఎదగాలి

హైదరాబాద్ జూన్17(ప్రభాత ఉదయం):

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సోనామసూరికి సంబంధించి వివిధ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెపకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లపడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి



విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. బిపిటి 5204, తెలంగాణ సోనా జై శ్రీరామ్, హెచ్ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమీషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. సమావేశంలో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

లక్నో జూన్ 17 (ప్రభాత ఉదయం)

ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ఈ రిక్షా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొంది . ఈ ఘటనలో ఆరుగురు మహిళలు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్, బదౌన్ జిల్లాలో బరేలి-మధుర హైవేపై బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్వానా గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు ఒక ఈరిక్షాలో బంధువుల ఇండ్లకు బయల్దేరారు. తమ ఇంట్లో పెళ్లికి ఆహ్వానించడానికి వెళ్లారు. ఈ క్రమంలో హైవేపై వెళుతుండగా, ముందు ఉన్న ట్రాక్టర్‌ను దాటుకొని ముందుకు వెళ్లేందుకు ఈరిక్షా డ్రైవర్ ప్రయత్నించాడు. ఒక ట్రాక్టర్‌ను దాటుకుని వెళ్తుండగా, ఎదురుగా వేగంగా వస్తున్న మరో ట్రాక్టర్‌ను ఈరిక్షా ఢకరెది. ఈ ఘటనలో ఆటోలోని మహిళల్లో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. ఆటో డ్రైవర్ షాని సహా మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జును-జజైంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని వారిని రక్షించే ప్రయత్నంచేశాయి. కానీ, అప్పటికే ఆరుగురు మరణించారు. గాయపడిన ముగ్గురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ రిక్షా డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మరోవైపు ఘటనకు కారకులైన రెండు ట్రాక్టర్లకు చెందిన డ్రైవర్లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతుల కుటుంబాలకు సంబంధించిన వారి ఇంట్లో ఈ నెల 29న వివాహం జరగాల్సి ఉంది. మరోవైపు ఈ ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# చిన్నారి అభిమానిని పరామర్శించిన పవన్

మొదటి పేజీ తరువాయి...

హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్, పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.



### వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు,

# సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

**రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**బుద్వేల్, జూన్ 17 (ప్రభాత ఉదయం) :**

వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని విభాగాల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుధవారం రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో జోన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జోన్ పరిధిలో వర్షాకాలంలో రోడ్ల పై నీరు నిల్వ ఉండే 11 ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు . ఆ ప్రాంతాలలో శాశ్వత సమస్య పరిష్కారం కోసం అవకాశం లేని చోట తాత్కాలిక పరిష్కారం చేసేలా అన్ని విభాగాల అధికారులు ముందుండి పని చేయాలన్నారు. ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద మాన్యువల్స్ ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వర్షాలు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండి నీరు సులభంగా వెళ్లడానికి అవకాశం కల్పించాలన్నారు. పిల్లల నెంబర్ 300 వద్ద రోడ్డుపై నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాందేవ్ బాబా దేవాలయం ప్రాంతంలో రోడ్లపై నీరు నిలిచి ఉంటుందని ఆ సమస్యను పరిష్కరించడానికి బుధవారం పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. బహదూర్ పుర పిజ్జా హోటల్ వద్ద నీరు నిలవకుండా చూడాలన్నారు. మన్మోహన్ సింగ్ బ్రిడ్జి పైన, ఓల్డ్ కర్నూలు రోడ్డులో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే
రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని వివిధ శాఖల అధికారుల సమావేశం లో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**చెట్ల కొమ్మలను తొలగించాలి:**

కరెంటు తీగలకు తగులుతున్న చెట్లను తొలగించడానికి విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలని, అవసరమైన చోట జిహెచ్ఎంసి అర్బన్ బయోడైవర్సిటీ సిబ్బందిని కూడా వాడుకోవాలని సూచించారు. కెన్సర్త్ మార్గంలో నీరు నిల్వ ఉండకుండా చేయడానికి నిధులు మంజూరయ్యాయని వాటితో భవాని కాలనీ ప్రజలతో మాట్లాడి పైపు లైన్ వేయడానికి ప్రయత్నం చూస్తామన్నారు. భవాని కాలనీ నుంచి శివరాంపల్లి వెళ్లే మార్గంలో ఉన్నటువంటి డివైడర్ స్థానంలో ఒక గేటు ఏర్పాటు చేసి అత్యవసర సమయంలో ఆ గేట్లు తెరిచి అటు ఇటు రాకపోకలు సాగించడానికి ఏర్పాటు చేయనున్నట్లు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ క్రింద యూటర్న్ లు ఎక్కువగా ఉన్నాయని ట్రాఫిక్ పోలీసులు సూచించారని వాటిపై కూడా అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆరాంఘర్ ఆర్టీసీ బస్ స్టాప్ వద్ద బస్సు షెల్టర్లను దూరంలో ఏర్పాటు చేసేలా చేస్తే ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చున్న ట్రాఫిక్ అధికారుల సూచనలు పరిగణనలోకి తీసుకొని ఆ విధంగా చేయడానికి కృషి చేస్తామన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి రాజేంద్రనగర్ జోన్ పరిధిలో నివసించే ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉ ందన్నారు. సమన్వయ కమిటీ సమావేశంలో జిహెచ్ఎంసి ఈఈ నరేందర్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ లు మల్లయ్య, అరుణకుమారి, పాపయ్య, ఎస్ ఈ నరేందర్ గౌడ్, టౌన్ ప్లానింగ్ ఎసిపి లు సుధాకర్, శ్రీధర్, రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బి కృష్ణా రెడ్డి, జలమండలి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మీ, విద్యుత్ రాజేంద్రనగర్ డీ ఈ పి రత్నాకర్ రావు, మహ్మద్ షఫీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.




**ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 170 వద్ద సీ ఎన్ జీ గ్యాస్ పిల్లింగ్ స్టేషన్ వద్ద సీఎన్ జీ గ్యాస్ కోసం బారులు తీరిన ఆటోలు, కార్లు..... బుధవారం ఉదయం 6 గంటల నుంచే సీ ఎన్ జీ గ్యాస్ కోసం ఆటోలు, కార్లు క్యూ కట్టాయి.**

**బుద్వేల్, ప్రభాత ఉదయం**

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి భార్గవ్ కుటుంబ సభ్యులకు రూ.25,500లు అందజేత

**బుద్వేల్, జూన్ 17 (ప్రభాత ఉదయం)**



శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న భార్గవ్ ఈ నెల 16వ తేదీ రాత్రి సాతంరాయి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన మృతికి శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉ పాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. భార్గవ్ కుటుంబ సభ్యులకు పాఠశాల తరపున రూ. 25,500లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్య శ్రీను నాయక్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి, ఉ పాధ్యాయులు పాల్గొన్నారు.



## అభివృద్ధే ప్రధాన ధ్యేయం..

**అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,జూన్17(ప్రభాత ఉదయం)**

అభివృద్ధే ప్రధానంగా పని చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీల్లో మొత్తం రూ. 216.50 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు.డివిజన్ 120,122 పరిధిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను ఆయన ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.రాజేంద్రనగర్ విలేజ్ లో సీసీ రోడ్డు నిర్మాణం రూ. 22.80 లక్షలు,భగవత్ గూడ స్టార్మ్ వాటర్ డ్రైన్,సీసీ రోడ్డు నిర్మాణం రూ. 45.60 లక్షలు,డివిజన్ 122 పరిధిలో శివసాయి ఫేజ్-2 సీసీ రోడ్డు నిర్మాణం రూ. 21.50 లక్షలు,ప్రతాప్ నగర్ కాలనీ సీసీ రోడ్డు నిర్మాణం రూ. 21.50 లక్షలు,రాధా రియాలిటీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు రూ. 33 లక్షలు,శ్రీనివాసం ఎన్క్లేవ్ సీసీ రోడ్డు నిర్మాణం రూ. 33 లక్షలు,సూర్యోదయ కాలనీ సీసీ రోడ్డు నిర్మాణం రూ. 24.50 లక్షలు,కాలికా నగర్ సీసీ రోడ్డు నిర్మాణం రూ. 14.60 లక్షలతో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,అధికారులు,ఆయా కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల శిక్షలకు కఠినమైన చట్టాలు తేవాలి

**న్యూఢిల్లీ జూన్17 (ప్రభాత ఉదయం)**

సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం.ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎపడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తాస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ. 3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉ ండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.



రఘు వంశీ ని అభినందిస్తున్న సీనియర్ రిపోర్టర్ అప్పారెడ్డి గూడెం భీమయ్య, మాధవి, శశాంక్ లు

## ఉన్నత విద్యనభ్యసించడానికి విదేశాలకు వెళ్తున్న రఘు వంశీ, శశిధర్‌లకు అభినందనల వెల్లువ

**బుద్వేల్, జూన్ 17 (ప్రభాత ఉదయం)**

ఉన్నత విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళ్తున్న రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి జి శరవన్ కుమార్, కళ్యాణీ ల కుమారుడు జి రఘు వంశీ , బీజేపీ సీనియర్ నాయకులు వేముల మల్లేష్ కుమారుడు వంశీధర్ లను సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య అభినందించారు. మాస్టర్స్ ఇన్ గ్లోబల్ బిజినెస్ (ఎం జీ బీ) ను చదవడానికి రఘు వంశీ , వంశీధర్ లు సింగపూర్ వెళ్ళనున్నారు. సింగపూర్ తో పాటు లండన్ , దుబాయ్ లో వీరు విద్యాభ్యాసం చేయనున్నారు. రఘు వంశీ కుటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం దగ్గరి బంధువులు, స్నేహితులకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య కుటుంబ సభ్యులతో పాటు జి శరవన్ కుమార్, కళ్యాణి ల బంధువులు, స్నేహితులు, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం సభ్యులు, కరస్పాండెంట్ లు రఘు వంశీ ని అభినందించారు. పూల మాలలు, పుష్ప గుచ్ఛాలు అందచేశారు. ఉన్నత చదువులు చదివి దేశానికి, సమాజానికి, కుటుంబానికి ఉ పయోగపడే వ్యక్తిగా ఎదగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.



రఘు వంశీ, శశిధర్ లను అభినందిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ అప్పారెడ్డి గూడెం భీమయ్య, రాజేందర్ లు



జయరాం ను అభినందిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

## ఆల్ యూనివర్శిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎస్ జయరాం

**బుద్వేల్, జూన్ 17 (ప్రభాత ఉదయం)**

ఆల్ యూనివర్శిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్ జయరాం నియమితులైనారు. బుధవారం మాసబ్ ట్యాంక్ లోని జేఎన్టీయు లో జరిగిన ఆల్ యూనివర్శిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎన్నికలలో రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాలకు చెందిన పాలక వర్గ సభ్యులు పాల్గొని ఆల్ యూనివర్శిటీస్ కు పాలకవర్గానికి ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ఖధీర్ నియమితులైనారు. గౌరవ అధ్యక్షులుగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచిం గ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం శ్రీనివాస్ యాదవ్ నియమితులైనారు. సెక్రటరీ జనరల్ గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ కి చెందిన ప్రేం కుమార్ నియమితులైనారు. ఈ పాలక వర్గం మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుందని ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు.



## యూనియన్ల పేరుతో కార్మికులతో అక్రమ వసూలు చేయడం సరికాదు..

**చేతనైతే వారి సమస్యల మీద పోరాటాలకు ఏఐటీయూసీ మద్దతు..**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు**

**రాజేంద్రనగర్,జూన్17(ప్రభాత ఉదయం)**

భవన నిర్మాణ కార్మికుల సమస్యల కోసం పనిచేస్తామని చెప్పి యూనియన్ ల పేర్లతో అక్రమ వసూలు చేయడం తగదని,వారి సమస్యల మీద పోరాడితే సహకారం అందిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు తెలిపారు.బుధవారం శంషాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పర్వతాలు మాట్లాడారు.భవన నిర్మాణ కార్మికుల సమస్యల మీద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాల కోసం వారి అభివృద్ధి కోసం బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ బిఓసీ యాక్టు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ నిరంతరం కార్మికుల పక్షాన ఉన్న ఏఐటీయూసీ సంఘం జిల్లా వ్యాప్తంగా లేబర్ అడ్డాల దగ్గర పని చేస్తుందని ఆయన తెలిపారు.కార్మికుల పక్షాన నిలబడి పనిచేస్తున్నాము,కానీ ఏనాడు కాంట్రాక్టర్ల దగ్గర లేదా కార్మికుల దగ్గర వసూలు చేయలేదని ఈ మధ్యకాలంలో వచ్చిన కొన్ని సంఘాలు కాంట్రాక్టర్ల దగ్గర మేస్త్రీల దగ్గర సంఘం పేరుతో యూనియన్ ఆఫీసుకు రావాలని సభ్యత్వం కట్టకపోతే మేస్త్రిగా గుర్తించమని బెదిరింపులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు.భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డాల దగ్గర టాయిలెట్స్,రేకుల షెడ్డులాంటి నిర్మాణ పనులు చేపట్టే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.విలేకర్ల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి ఏఐటీయూసీ మండల కార్యదర్శి గిలకరాజు,సహాయ కార్యదర్శి నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు 20 సంవత్సరాల పాటు మన్నికగా ఉండాలి: ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, జూన్ 17 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్ బాబు జగ్జీవన్ం వీధి, బుద్వేల్ భగవత్ గూడ బస్తీలలో రూ. 68.4లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, స్ట్రాం వాటర్ డ్రైయిన్ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ బుధవారం శంకుస్థాపన లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడతున్నామన్నారు. పనులు నాణ్యత గా జరిగేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఒక సారి సీసీ రోడ్డు వేస్తే 20 సంవత్సరాల వరకు చెక్కు చెదరకుండ ఉ ండాలన్నారు. ఆ విదంగా ఇంజనీరింగ్ విభాగం అధికారులు పనులు చేయించాలన్నారు. ఎక్కడైన పనులు నాణ్యతగా లేకుంటే అక్కడ ఇం జనీరింగ్ విభాగం అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నాణ్యత విషయంపై ప్రజలు కూడా అధికారులను ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ కు చెందిన బస్తీ పెద్దలు కనకమామిడి జంగయ్య, డాక్టర్ వి శ్రీరాములు, నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు మంగలారం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పలుగుచెరువు మహేశ్, రగడంపల్లి శ్రావణ్, వీపీ లలిత్, బొక్క ప్రభాకర్ రెడ్డి, ఎం యాదమ్మ యాదవ్, పి ఉమా మహేశ్వరి, దుంబాల ఝాన్సీరెడ్డి, అనుమూల జాన్ పాల్, మహ్మద్ గౌస్, బుద్వేల్ కు చెందిన దేవిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, రాజు, పెండ్యాల శ్రీధర్, పెండ్యాల సాయిమల్లిక్, మాదవులు తదితరులు పాల్గొన్నారు..



రాజేంద్రనగర్ లో సీ సీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



బుద్వేల్ భగవత్ గూడ లో స్ట్రాం వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# మాజీ ఎమ్మెల్యే పాపిరెడ్డి భార్య కన్నుమూత

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 17(ప్రభాత ఉదయం)**

బీజేపీ సీనియర్ నేత, రాయిచూర్ మాజీ ఎమ్మెల్యే ఎ.పాపిరెడ్డి సతీమణి పార్వతమ్మ(65) కన్నుమూశారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బెంగుళూర్ లో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆదిలక్ష్మి మృతి చెందిన విషయం తెలుసుకుని రాయిచూర్ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్,గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,రాయచూర్ మున్నూరు కాపు సంఘం నాయకులు బెల్లం నర్సిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు, జోగులాంబ గద్వాల జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు.





## అయిజలో స్కూల్ బస్సులపై ఆర్టీఏ అధికారుల కొరడా

**ఫిట్నెస్ లేని రెండు బస్సులు సీజ్ చేసిన అధికారులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 17(ప్రభాత ఉదయం):**

విద్యార్థుల భద్రతే ధ్యేయంగా జిల్లా రవాణా శాఖ అధికారి (ఋూ) రాధిక ఆదేశాల మేరకు బుధవారం అయిజ పట్టణంలో గద్వాల రవాణా శాఖ అధికారులు విస్తృతంగా ప్రైవేటు స్కూల్ బస్సుల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సుల ఫిట్నెస్, పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా, కనీస ఫిట్నెస్ లేకుండా నడుపుతున్న కాకతీయ మరియు వైష్ణవి పాఠశాలలకు చెందిన రెండు బస్సులను రవాణా శాఖ అధికారులు పట్టుకున్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతున్న ఈ రెండు బస్సులను తక్షణమే సీజ్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు గద్వాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (వీఎ×) రామ్ చరణ్ వెల్లడించారు. సందర్భంగా ఎంవీఐ రామ్ చరణ్ మాట్లాడుతూ.. పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా రవాణా శాఖ నిబంధనలు పాటించాలని, విద్యార్థుల రవాణా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ఫిట్నెస్ లేని వాహనాలను రోడ్లపైకి తెస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో గద్వాల రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది గోవర్ధన్, రిషి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో చిన్నారిపై అఘాయిత్యం: కరాటే కోచ్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష!

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్కూల్ ప్రిన్సిపాల్‌కు మూడేళ్ల జైలు**

**రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు**

**శేరిలింగంపల్లి : జూన్ 17,(ప్రభాత ఉదయం)**



సైబరాబాద్ క్రైమ్ డిసిపి ముత్యంరెడ్డి..

స్కూల్ వ్యాన్ ఆలస్యంగా రావడాన్ని ఆసరాగా చేసుకుని, కేవలం మూడేళ్లన్నర వయసున్న పసికందుపై లైంగిక దాడికి ఒడిగట్టిన కరాటే కోచ్‌కు కోర్టు కఠిన శిక్ష విధించింది. నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 20,000 జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్‌లోని పోక్సో కేసుల ప్రత్యేక కోర్టు న్యాయ మూర్తి టి. శ్రీనివాస్ సంచలన తీర్పు వెలువరించారు. ఇదే కేసులో బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు కూడా మూడేళ్ల సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.కేసు వివరాల్లోకి వెళ్తే మియాపూర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 2019 జూన్ 20న ఈ ఘోరం జరిగింది. స్కూల్ వ్యాన్ ఆలస్యంగా రావడంతో ఒంటరిగా ఉన్న సదరు చిన్నారిని జిమ్నాస్టిక్, కరాటే కోచ్‌గా పనిచేస్తున్న కూర కిరణ్ సాయి (31) పై అంతస్తులోని జిమ్నాస్టిక్ రూమ్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఎవరూ లేని సమయం చూసి, గది మూలలో చిన్నారిపై దారుణంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఏడుస్తున్న బాధితురాని గ్రౌండ్ ఫ్లోర్‌లో వదిలేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన చిన్నారి అసాధారణంగా ప్రవర్తిస్తూ, ప్రైవేట్ భాగంలో నొప్పిగా ఉందంటూ ఏడ్చింది. పాఠశాలలో కిరణ్ అంకుల్ తనను ఇబ్బంది పెట్టాడని, తాను స్కూల్‌కు వెళ్లనని తండ్రికి చెప్పడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితురాలి తండ్రి 27 జూన్ 2019న మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేయడంతో పాటు జువెనైల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 75 కింద కేసు నమోదు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ చిలకముక్కు దీపిక (37) తన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే నిందితుడు కిరణ్‌కు ఈ అవకాశం దొరికిందని దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు 2019 జూలై 2 న నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పక్కా ఆధారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం, నేరం రుజువు కావడంతో నిందితులకు పైవిధంగా శిక్షలు ఖరారు చేసినట్లు సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి ప్రకటనలో వెల్లడించారు. బాధితురాలికి మూడు లక్షలు రూపాయలు నష్ట పరిహారం కింద బాధితురాలికి చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## పొలం పంచాయతీలో తల్లీ కూతుళ్లపై దాడి

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 17(ప్రభాత ఉదయం)**



కోర్టు పరిధిలో ఉన్న వ్యవసాయపొలంలో ఎందుకు సాగు చేశారంటూ ప్రశ్నించిన తల్లికూతుళ్లపై దాడి చేసిన ఘటన సోమవారం ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లు గద్వాల జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి:మార్లబీడు గ్రామానికి చెందిన నర్సింహులు, జమ్మన్న అన్నదమ్ముల మధ్య గత కొంతకాలంగా ధరూర్ శివారులో గల వ్యవసాయ పొలం విషయమై ఇద్దరి మధ్య పంచాయతీ నడుస్తుంది. భాగ పరిష్కారం సరిగా చేయాలేదంటూ నర్సింహులు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం జమ్మన్న కోర్టు పరిధిలో ఉన్న వ్యవసాయ పొలంలో పత్తి విత్తనాలు నాటడానికి సిద్ధమయ్యాడు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన నర్సింహులు భార్య పద్మమ్మ, అతని కూతురు పవిత్ర నిలదీశారు. కోర్డు పరిధిలో ఉన్న భూమిని ఎలా సాగు చేస్తారంటూ నిలదీయడంతో జమ్మన్న కుటుంబ సభ్యులు కలిసి తల్లీ కూతుళ్లపై దాడికి పాల్పాడారంటూ బాధితులు ఆరోపించారు. తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్ల ఇద్దరిని సమీపంలో ఉన్న రైతులు నర్సింహులుకు సమాచారం అందించారు. గాయపడిన వారిని ఎద్దుల బండీ మీద అంబులెన్స్ వాహనం వద్దకు తరలించి అక్కడ నుంచి గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు గద్వాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. కాగ నర్సింహులు కుటుంబ సభ్యులు తమ పై దాడి చేశారని ఆరోపిస్తూ జమ్మన కుటుంబ సభ్యులు ధరూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కోర్టు పరిధిలో ఉన్న పొలాన్ని ఎలాసాగు చేస్తారని నర్సింహులు భార్య, కూతురు నిలదీసిన క్రమంలో జమ్మన కుటుంబ సభ్యులు తమ పై దాడి చేశారంటూ బాధితులు ఆరోపిస్తూ జమ్మన్న కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు. ధరూర్ ఎస్ఐ నందీకర్ ను వివరణ కోరగా...దాడికి పాల్పడిన జమ్మనతో పాటు మరో కొందరిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

## బాలికపై లైంగిక దాడి కేసు: నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 17(ప్రభాత ఉదయం)**



మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ గద్వాల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్-కమ్-పోక్సో కోర్టు న్యాయమూర్తి వి. శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు.కేసు వివరాలు:రాజోలి మండలానికి చెందిన కమ్మరి పెద్ద చిన్నయ్య అనే వ్యక్తి, 2023 జనవరి 30న స్థానిక స్కూల్ దగ్గర ఉన్న ఒక మైనర్ బాలికకు రూ.5 ఇచ్చి, షాపులో ఏదైనా కొనిస్తానని నమ్మబలికాడు. ఆపై బాలికను ఎత్తుకెళ్లి తన ఇంట్లో బలాత్కారం చేశాడు. దీనిపై జనవరి 31, 2023న బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రాజోలి హెడ్ కానిస్టేబుల్ టి. శ్రీనివాసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.అప్పటి సిఐ శివశంకర్ కేసును వేగంగా దర్యాప్తు చేసి, ఫిబ్రవరి 1, 2023న నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం మార్చి 1, 2023న కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.కోర్టు ట్రయల్స్ సమయంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్ ఆదేశాల మేరకు, డిఎస్పీ వై. మొగిలయ్య పర్యవేక్షణలో శాంతినగర్ సీఐ శంకర్, రాజోలి ఎస్సై కె. గోకారి, గద్వాల భరోసా కేంద్రం బృందం సాక్షులను పక్కాగా కోర్టులో ప్రవేశపెట్టారు. అడిషనల్ పీపీ కె. విజయ్ కుమార్ బలమైన వాదనలు వినిపించారు. నేరం నిరూపితం కావడంతో న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.బాధిత బాలికకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూసి, నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించిన అధికారులను, సిబ్బందిని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ప్రత్యేకంగా అభినందించారు.




మంచిర్యాల లో సమాచార హక్కు చట్టం పై జరిగిన అవగాహన సదస్సు లో పాల్గొన్న సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్ లు

## మంచిర్యాల జిల్లాలో సమాచార హక్కు చట్టం-2005పై అధికారులకు విస్తృత అవగాహన సదస్సు..

**పారదర్శకత, జవాబుదారీతనంతో పని చేయాలని ఆదేశం**

**మంచిర్యాల, జూన్ 17 (ప్రభాత ఉదయం) :**

ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం ఒక శక్తివంతమైన సాధనమని, దీనిని ఎటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ శాఖలు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని సమాచార హక్కు చట్టం రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. జి.చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య (స్థానిక సంస్థలు), వి.రాములు (రెవెన్యూ), బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి జిల్లా స్థాయి అధికారులకు సమాచార హక్కు చట్టం-2005 సమర్థవంతమైన అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలకు సమాచారాన్ని సకాలంలో అందించడం ప్రతి ప్రభుత్వ అధికారి బాధ్యత అని తెలిపారు. చట్టం ప్రకారం దరఖాస్తు అందిన ముప్పై రోజులలోపు ఖచ్చితంగా సమాచారం ఇవ్వాలని, ఒకవేళ గడువు దాటితే ఆ సమాచారాన్ని దరఖాస్తుదారునికి ఉచితంగా అందించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ప్రతి అధికారి చట్టంలోని నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని, కమిషన్ ముందు అప్పీళ్ల పరిష్కార సమయాల్లో ప్రజా సమాచార అధికారులు తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖల ప్రథమ అప్పీళ్ల అధికారులకు, ప్రజా సమాచార అధికారులకు, సహాయ ప్రజా సమాచార అధికారులకు చట్టంలోని ముఖ్యమైన నిబంధనలు, దరఖాస్తుల పరిష్కార కాలపరిమితులు, అప్పీళ్ల నిర్వహణ మరియు సమాచారాన్ని అందించడంలో పాటించాల్సిన విధివిధానాలపై కమిషన్ సభ్యులు విస్తృత అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ అందించిన సలహాలు, సూచనలను జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాటించాలని, నిర్దిష్ట వ్యవధిలో ప్రజలకు సకాల సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న అప్పీళ్ళ దరఖాస్తులను అధికారులు సుదీర్ఘంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీళ్ళ అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ప్రభుత్వ బడులను మూసివేయొద్దు

**27 వేల స్కూళ్లను 4 వేలకు తగ్గించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలి.ద.. ఉన్న బడులను బాగు చేయండి**

**మరుగుదొడ్లు, తాగునీరు కల్పించి, ఖాళీ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి... ప్రైవేట్ ఫీజులను నియంత్రించాలి**

**ఫీజుల దోపిడీపై తక్షణమే చట్టం తీసుకురావాలి.**

**గద్వాల: జూన్ 17(ప్రభాత ఉదయం):**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 27,000 నుండి 4,000 కు తగ్గించాలని ప్రభుత్వం భావించడంపై గట్టు మండలం తల్లుల సంఘం అధ్యక్షురాలు, సభ్యులు లక్ష్మి, శృతి, ప్రశాంతి, శాంతమ్మ, శిరీష తదితరులు బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'బడిబాట' ద్వారా ఎంతో శ్రమించి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించామని, ఇప్పుడు బడులను మూసివేస్తే పేద పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.పట్టణాల్లో ప్రభుత్వ బడులు లేక సామాన్యులు అప్పులు చేసి ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారని, సంపాదనంతా ఫీజులకే సరిపోతోందని తల్లులు పేర్కొన్నారు. ప్రభుత్వం బడుల మూసివేత నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలి, ఉన్న పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఉపాధ్యాయులను నియమించాలి,విద్యా కమిషన్ సిఫారసుల ప్రకారం ప్రైవేట్ ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి,'అభయహస్తం' వాగ్దానం ప్రకారం విద్యా బడ్జెట్‌ను 15% కి పెంచాలి,జనాభా ప్రాతిపదికన పట్టణాల్లో కొత్త బడులు తెరవాలి,ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు కలిసికట్టుగా ఉద్యమించాలని తల్లుల సంఘం పిలుపునిచ్చింది.



## అంగన్వాడీలో ఉచిత దుస్తుల పంపిణీ

**మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 17(ప్రభాత ఉదయం):**

కేటిదొడ్డి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు ఉచితంగా దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు చిన్నారులు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ స్థాయి నుంచే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి, విద్యాభ్యాసానికి అంగన్వాడీ కేంద్రాలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.కేటిదొడ్డి మండలం అధ్యక్షులు ఉరుకుందు, గ్రామ సర్పంచ్ నారాయణ, కొండాపురం సర్పంచ్ పవన్ కుమార్, ఉప సర్పంచ్ పెద్ద వీరన్న గౌడ్, సీనియర్ నాయకులు బి. కొండన్న, చాకలి వెంకటేష్, పిల్లి శీను, తదితరులు పాల్గొన్నారు

## చాగదోణ గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో వ్యవసాయ గోదాము నిర్మాణం

**భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 17(ప్రభాత ఉదయం)**

పంటలకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవడానికి గోదాములు ఎంతో ఊరట: ఎమ్మెల్యే... గద్వాల ప్రతినిధి: రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ ఉంచుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ గోదాముల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.బుధవారం గట్టు మండల పరిధిలోని చాగదోణ గ్రామంలో చీ=జు+టా (ఉపాధి హామీ) పథకం కింద రూ. 30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ గోదాం భవనానికి గద్వాల ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, భూమి



పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు కష్టపడి పండించిన పంటలకు మార్కెట్లో సరైన గిట్టుబాటు ధర రానప్పుడు, అధైర్యపడి తక్కువ ధరకే అమ్ముకోకుండా.. మంచి ధర వచ్చే వరకు భద్రపరుచుకోవడానికి ఈ గోదాంలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ఇలాంటి వసతులను గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి తెస్తోందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, చాగదోణ సర్పంచ్ వీరేష్ స్వామి, ఉప సర్పంచ్ రంగన్న, ముచ్చోని పల్లి సర్పంచ్ వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు,మాజీ సర్పంచ్ శంకరన్న, బి. శివప్ప, హరిచంద్ర గౌడ్, గుడిసె నర్సింలు, వడ్డే ఉసేని, ఎండి బడే సాబ్, ఆకుల మునిస్వామి, మిట్టదొడ్డి లక్ష్మిరెడ్డి, సంగటి భాస్కర్, జె. పరమేష్, మొండి భాస్కర్, నర్సింలు, సుంకన్న, ప్రవీణ్, ఫకీరన్న, స్థానిక రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608